క్లుప్తంగా

క్యాలెండర్లు, డైరీలు ఆవిష్కరణ



డైరీలు ఆవిష్కరిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి చంద్రశేఖర ప్రసాద్

కొత్తగూడెంటౌన్: జిల్లా జ్యుడీషియల్ ఎంప్లాయిస్ క్యాలెండర్లు, డైరీలను జిల్లా ప్రధాన న్యాయమూర్తి పసువులేటి చంద్రశేఖర ప్రసాద్ బుధవారం తన చాంబర్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో జ్యుడీషియల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు రామిశెట్టి రమేష్, డికొండ రవికుమార్, లగడపాటి సురేష్, మల్లికార్జున్, శ్రీనివాస్‌రాజు, ఆర్.నాగేశ్వరావు, శ్రీరంగం రామకృష్ణ, నరేంద్రకుమార్, హరినారాయణరెడ్డి, ఏటీజీ అనిత, మీనాకు మారి తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో..



రంగాకిరణ్‌కు డైరీ అందజేస్తున్న రిటైర్డ్ సంఘం ఉద్యోగులు

చుంచుపల్లి: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం (టీఎస్‌జీఆర్‌ఈఏ) చుంచుపల్లి మండల యూనిట్ సభ్యులు నూతన సంవర్సత డైరీని బుధవారం బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ మీడియా సెల్ కోఆర్డినేటర్ కేవీ రంగాకిరణ్ ఆవిష్కరించారు. అనంతరం సంఘం సభ్యులు నూతన సంవత్సర డైరీని రంగా కిరణ్‌కు అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం (టీఎస్‌జీఆర్‌ఈఏ) మండల ప్రెసిడెంట్ పాపయ్య, సెక్రెటరీ కోటేశ్వరరావు, అసోసియేషన్ ప్రెసిడెంట్ శేషగిరిరావు, శివరాంజీ పాల్గొన్నారు.

కులం అడ్డుగోడలను కూల్చాలి



కులాంతర వివాహం చేసుకున్న జంటను అభినందిస్తున్న పెద్దలు

ఇల్లెందు: నేటికీ వేళ్లూనుకుని ఉన్న కులం అడ్డుగోడలను కూల్చాలని టీఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మేకల శ్యాం, మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు ఆదూరి రవి అన్నారు. బుధవారం సత్యనారాయణపురంలో జరిగిన కులాంతర వివాహం చేసుకున్న ఓ జంటను వారు అభినందించారు. బీసీ వర్గానికి చెందిన ప్రశాంత్, ఎస్సీ వర్గానికి చెందిన జ్యోతిలను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మహాలక్ష్మయ్య, రత్తారపు మల్లేశ్వరి, భాగ్యలక్ష్మి, దుర్గాప్రసాద్, హరినాథ్‌బాబు, దుర్గాప్రసాద్, శ్రీనివాస్, స్వామీనాయక్ తదితరులు పాల్గొన్నారు.


వాలీబాల్ కిట్లు పంపిణీ



కిట్లు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

ఇల్లెందు: మండలంలోని ముత్తారపుకట్ట పంచాయతీలో యువతీ, యువకులకు వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య క్యాంపు కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కనకయ్య వర్గం ప్రజాప్రతినిధులు ఎంపీటీసీలు మండల రాము, పూనెం సురేందర్, తాటి రాంబాబు, ఉరవకొండ ధనుంజయ్, తాటి భిక్షం, ముక్తి కృష్ణ, బోళ్ల సూర్యం, నాగార్జున్, సతీష్‌ల చేతుల మీదుగా కిట్లు పంపిణీ చేశారు. యువతీ యువకులు క్రీడలలో ఐక్యతను చాటాలని, ప్రతిభను ప్రదర్శించుకోవాలని వారు సూచించారు.

మార్కెట్‌లోకి నూతన మోడళ్లు



కారును ఆవిష్కరిస్తున్న ఆర్‌టీఓ వేణు

చుంచుపల్లి: ప్రముఖ కార్ల కంపెనీ హ్యూందాయ్ మోటర్ ఇండియా వారి గ్రాండ్ ఐటెన్ నియాస్, ఆరా కొత్త వర్షన్ కార్లను విద్యానగర్‌లోని భరత్ హ్యూందాయ్ షోరూమ్‌లో బుధవారం జిల్లా రవాణాశాఖ అధికారి పి.వేణు చేతుల మీదుగా ఆవిష్కరించారు.ఏజీఎం శబరినాథ్, షోరూమ్ సిబ్బంది పాల్గొన్నారు.

మట్టి రోడ్డుగా మారిన బీటీ రోడ్డు

- అధికారుల నిర్లక్ష్యం
- దుమ్ము, ధూళితో ఇబ్బందులు
- అనారోగ్యం బారిన పడుతున్న ప్రజలు



జూలూరుపాడులో మట్టితో పేరుకపోయిన ప్రధాన రహదారి

జూలూరుపాడు: మండల కేంద్రం జూలూరుపాడులోని తల్లాడ–కొత్తగూడెం ప్రధాన రహదారి మట్టితో నిండిపోయింది. జూలూరుపాడులో సెంట్రల్ లైటింగ్, డ్రెయినేజీలు, డివైడర్ల నిర్మాణం కోసం డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ ట్రస్టు (డీఎంఎఫ్‌టీ) నిధులు రూ.5.22 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. డ్రెయినేజీ నిర్మాణ పనుల్లో భాగంగా 9 నెలల క్రితం ప్రధాన రహదారికి ఇరువైపులా తవ్వకాలు చేపట్టడంతో మట్టి పేరుకపోయింది. దీంతో ఇది బీటీ రోడ్డా? మట్టి రోడ్డా? అనే అనుమానం కలగక మానదు. ప్రధాన రహదారిపై నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు కొనసాగిస్తుండటంతో బీటీ రోడ్డుపై ఉన్న మట్టి, దుమ్ము, ధూళి లేస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రహదారికి ఇరువైపుల ఉన్న ఆవాసాల వారు, చిరు వ్యాపారులు, ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వాహనాల రాకపోకలతో దుమ్ము కళ్లల్లో పడి మండుతున్నాయి. అదేవిధంగా జలుబు, దగ్గు, తుమ్ములతోపాటు, ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధులు, చర్మ వ్యాధుల బారినపడి ఆస్పత్రులపాలవుతున్నామని స్థానికులు వాపోతున్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి ఇండియన్ పెట్రోల్ బంక్ వరకు డ్రెయినేజీ పనులు పూర్తయినా రోడ్డుపై మట్టి పూర్తిస్థాయిలో తొలగించకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. బీటీ రోడ్డును శుభ్రం చేయాల్సిన ఆర్‌అండ్‌బీ అధికారులు రోడ్డుపై పేరుకపోయిన మట్టిని డోజర్లతో తాత్కాలికంగా నెట్టించి చేతులు దులుపుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. దీనికి తోడు గ్రామ పాలకులు, మండల అధికారులు సైతం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఈ సమస్యను ఆర్‌అండ్‌బీ అధికారులు, గ్రామ పాలకులు, మండలాధికారులకు దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, గ్రామ పాలకులు, మండల అధికారులు బీటీ రోడ్డును శుభ్రం చేయించాలని ప్రజలు కోరారు.

దుమ్ముతో ఇబ్బంది పడుతున్నాం



వాహనాల రాకపోకల కారణంగా రోడ్డుపై ఉన్న మట్టి కారణంగా దుమ్ము లేస్తుండటంతో అనారోగ్యం పాలవుతున్నాం. ధూళి కళ్లల్లో పడి మండుతున్నాయి. డ్రెయినేజీ పనులు నెలలు గడుస్తున్నా పూర్తి కావడం లేదు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు.

– కొండా శ్రీనివాసరావు, వ్యాపారి, వెంగన్నపాలెం

రోడ్డుపై మట్టి తొలగించాలి



రోడ్డుపై పేరుకపోయిన మట్టిని తొలగించాలి. నిత్యం వందలాది వాహనాల రాకపోకలతో రోడ్డుపై దుమ్ము, ధూళి లేస్తోంది. రోడ్డుపై నీళ్లు చల్లకపోవడంతో దుమ్ముతో అనారోగ్యానికి గురవుతున్నాం. దీంతో వ్యాపారం చేయడం కూడా ఇబ్బందికరంగా ఉంది. అధికారులు చర్యలు తీసుకోవాలి.

– ధరావత్ సైదా, ఫ్యాన్సీ స్టోర్, వెంగన్నపాలెం

శుభ్రం చేయిస్తాం



రోడ్డుపై ఉన్న మట్టి, ఇసుకను శుభ్రం చేసేందుకు చర్యలు తీసుకుంటాం. రోడ్డును శుభ్రవ చేయాలని సర్పంచ్, పంచాయతీ సెక్రటరీలను ఆదేశించాము. గతంలో డోజర్‌తో తొలగించినప్పటికీ పూర్తిస్థాయిలో శుభ్రం కాలేదు. నీళ్లతో శుభ్రం చేయాల్సి ఉంది. చేయిస్తాం.

– డి.రామారావు, ఎంపీఓ, జూలూరుపాడు

దేశానికి తెలంగాణ ఆదర్శం



కల్యాణలక్ష్మి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే రాములునాయక్

జూలూరుపాడు: తెలంగాణలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ అన్నారు. జూలూరుపాడులో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన 45 మంది లబ్ధిదారులకు రూ.45,05,220 విలువైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు, ఏడుగురికి రూ.2,65,500 విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పడక ముందు, ఆతర్వాత అభివృద్ధిని పరిశీలిస్తే ఎంతో తేడా ఉంటుందని చెప్పారు. దళిత అభ్యున్నతికి దళిత బంధు పథకాన్ని అమలు చేస్తున్న ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కాగా, కేంద్రప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంపై సవితి తల్లి ప్రేమ చూపిస్తోందని రాములునాయక్ విమర్శించారు. ఇక చెక్కుల పంపిణీ ఉదయం 9గంటలకు ఉంటుందని చెప్పడంతో లబ్ధిదారులు ఉదయం 8.30 గంటలకే రాగా, ఎమ్మెల్యే మధ్యాహ్నం 12.30 గంటలకు రావడం, అప్పటి వరకు కనీసం తాగునీటి కూడా వసతి లేక లబ్ధిదారులు అవస్థలు పడ్డారు. సమావేశంలో తహసీల్దార్ లూథర్ విల్సన్, ఎంపీడీఓ కే.ఎస్.వెంకటేశ్వరరావు, ఎంపీపీ లావుడ్యా సోనీ, సర్పంచ్‌లు గలిగె సావిత్రి, లావుడ్యా కిషన్‌లాల్, ముక్తి నరసింహారావు, బోడా శాంతిరాం, బి.రాములు, భూక్యా పద్మ, బాదావత్ లక్ష్మి, బోడా కైక, బోడా భోజ్యా నాయక్‌తో పాటు లేళ్ల వెంకటరెడ్డి, ఎదళ్లపల్లి వీరభద్రం, పొన్నెకంటి సతీష్‌కుమార్, సున్నా రంగారావు, దుద్దుకూరి మధుసూధన్‌రావు, ఎస్‌కే.లతీఫ్ తదితరులుపాల్గొన్నారు.

సామాజిక తనిఖీ ప్రారంభం

సుజాతనగర్: 2020 జనవరి నుంచి 2022 మార్చి 31 వరకు ఉపాధి హామీ పథకంలో చేపట్టిన ఉపాధి పనులపై బుధవారం మండల వ్యాప్తంగా సామాజిక తనిఖీ ప్రారంభమైంది. 27 నెలల కాలంలో రూ.13 కోట్లతో చేపట్టిన ఉపాధి పనులపై వివరాలను నమోదు చేయనున్నారు. 10 మంది డీఆర్‌పీలు, 21 మంది వీఆర్‌పీలు తనిఖీల్లో పాల్గొంటున్నట్లు ఎస్‌ఆర్‌పీ రాంబాబు తెలిపారు. అనంతరం గ్రామసభలు నిర్వహించి, మండల స్థాయిలో ప్రజావేదిక కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు.

ప్రభుత్వాస్పత్రిలో మౌలిక వసతులు కల్పించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నరేష్

సుజాతనగర్: ప్రభుత్వాస్పత్రిలో పడకల స్థాయిని పెంచడంతో పాటు, 24 గంటలూ వైద్యసేవలు అందేలా చేయాలని కోరుతూ జిల్లా వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో తహసీల్దార్ సునీల్‌కుమార్‌రెడ్డికి బుధవారం వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు బుట్టి నరేష్ మాట్లాడుతూ.. సుజాతనగర్ ప్రభుత్వాస్పత్రి అందరికీ అందుబాటులో ఉండటంతో చంద్రుగొండ, జూలూరుపాడు మండల ప్రజలు వైద్యసేవల కోసం ఇక్కడికే రావడం జరుగుతోందన్నారు. ఆస్పత్రులో మరుగుదొడ్ల సదుపాయం లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

పంచాయతీ నిధులు దుర్వినియోగం



టేకులపల్లి ఎంపీఓకు వినతిపత్రం అందజేస్తున్న వార్డు సభ్యులు

టేకులపల్లి: బేతంపూడి గ్రామ పంచాయతీ సర్పంచ్, కార్యదర్శి, ఉప సర్పంచ్ ముగ్గురూ కుమ్మక్కై పంచాయతీ నిధులు దుర్వినియోగం చేస్తున్నారని ఆ పంచాయతీ వార్డు సభ్యులు ఆరోపించారు. ఈ మేరకు బుధవారం టేకులపల్లిలో ఎంపీఓ జేఎల్ గణేష్‌కు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. మాట్లాడుతూ.. ఆరు నెలలుగా పాలకమండలి సమావేశాలు కూడా నిర్వహించడం లేదని, ఆదాయ వ్యయాల వివరాలు తెలియజేయడం లేదన్నారు. కార్యదర్శి, సర్పంచ్, ఉప సర్పంచ్‌లకు ఇష్టమైన, వారి బంధువుల పేర్ల మీద చెక్కులు కొట్టించి నిధులు డ్రా చేసుకుంటున్నారని ఆరోపించారు. పంచాయతీలో జరిగే అభివృద్ధి కార్యక్రమాల సమాచారం కూడా ఇవ్వడం లేదని వాపోయారు. నిధులు దుర్వినియోగం చేస్తున్న సర్పంచ్, కార్యదర్శి, ఉప సర్పంచ్‌లపై చర్యలు తీసుకోవాలని వార్డు సభ్యులు భిక్షం, మంగ, శ్రీనివాస్, సునీత, శంకర్, పద్మ కోరారు.

ఓటుతో ప్రజాస్వామ్యం పదిలం

జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో బుధవారం కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాల్లో ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. వివిధ పాఠశాలలు, కాలేజీల విద్యార్థులతో ర్యాలీ, మానవహారం నిర్మించి ఓటు విలువ తెలియజేశారు. – సాక్షి నెట్‌వర్క్



కొత్తగూడెంఅర్బన్: విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం



ఇల్లెందురూరల్: రెవెన్యూ ఆధ్వర్యంలో ర్యాలీ...



పాల్వంచరూరల్: కేఎల్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు



సింగరేణి(కొత్తగూడెం): ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు



పాల్వంచరూరల్: నాగారం కాలనీలో ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు



సుజాతనగర్: ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు



టేకులపల్లిలో ర్యాలీలో తహసీల్దార్, ఎంఈఓ



ఇల్లెందురూరల్: మాట్లాడుతున్న దిండిగల రాజేందర్



పాల్వంచరూరల్: పాండురంగాపురంలో ముగ్గులు వేసిన విద్యార్థులు



ఇల్లెందు: ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు



జూలూరుపాడులో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే వనమా

పాల్వంచరూరల్: తెలంగాణ రాష్ట్రంలోని నిరుపేద ఆడబిడ్డలకు ముఖ్యమంత్రి కేసీఆర్ పెద్దన్నగా ప్రవేశపెట్టిన కల్యాణలక్ష్మి పథకం వరం లాంటిందని ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. పాత పాల్వంచలోని ఎమ్మెల్యే నివాసంలో బుధవారం లక్ష్మీదేవిపల్లి మండలానికి చెందిన 110మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి పథకం కింద రూ.1.10 కోట్లు విలువ గల చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వనమా మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా ఏ రాష్ట్రంలో అమలు చేయని విధంగా తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ కల్యాణ లక్ష్మి పథకాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలో ప్రజలకు ఏ కష్టం వచ్చినా తాను అండగా ఉండి సమస్యలను పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు, ఆర్‌ఐ, నర్సింహారావు, ఎంపీపీ సోనా, సర్పంచ్‌లు అజ్మీరా భారతి, కొరెం చంద్రశేఖర్, జోగి బక్కయ్య, వర్సా వసంతరావు, కొత్తగూడెం డివిజన్ ఆత్మకమిటీ డైరెక్టర్ వినోద్, పొగాకు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బదిలీలు పారదర్శకంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న చావా రవి

పాల్వంచ: ఉపాధ్యాయులకు ఐదేళ్ల తర్వాత చేపడుతున్న బదిలీలు, ఎనిమిదేళ్ల తర్వాత చేపడుతున్న పదోన్నతులను పారదర్శకంగా నిర్వహించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో మండల అధ్యక్షుడు రాంబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడారు. బదిలీల్లో రెండు సంవత్సరాల కనీస సర్వీస్ నిబంధనను సవరించాలని, జీఓ 317 ద్వారా ఇతర జిల్లాలకు కేటాయించబడిన ఉపాధ్యాయులందరికీ బదిలీల్లో అవకాశం ఇవ్వాలని, సర్వీస్ సీనియారిటీ పాయింట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అప్‌గ్రేడ్ చేసి 10,479 పోస్టుల్లో న్యాయ వివాదాలను పరిష్కరించి, పండిట్, పీఈటీలకు ఇతర స్కూల్ అసిస్టెంట్స్‌తో సమానంగా పదోన్నతులు అమలు చేయాలని, జీఓ 317 ద్వారా విడిపోయిన దంపతులకు స్పౌజ్ బదిలీలు ఇవ్వాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి బి.రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.కృష్ణ, ఎస్.వెంకటేశ్వర్లు, మల్లెంపాటి వెంకటేశ్వర్లు, ఎస్‌కే.యాకూబ్‌పాషా, కె.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలు పరిష్కరించే వరకు పోరాటం



మాట్లాడుతున్న దేవీప్రసన్న

పాల్వంచరూరల్: ప్రజా సమస్యలను ప్రభుత్వ అధికారులు, పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారు. పరిష్కరించే వరకు పోరాటం ఆగదని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు తోట దేవీప్రసన్న అన్నారు. ఉల్వనూరు గ్రామపంచాయతీ నర్సింహాసాగర్ గ్రామాన్ని ఆమె బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మాట్లాడుతూ.. ప్రజల ఓట్లతో గెలుపొందిన నేతలు గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తామని హామీలు ఇచ్చి గెలిచిన తర్వాత విస్మరిస్తున్నారని విమర్శించారు. గ్రామానికి త్రీఫేస్ విద్యుత్ సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇస్తామని నేటికీ ఇవ్వలేదన్నారు. రహదారి కూడా బాగలేదని వెంటనే రహదారి నిర్మాణం చేయాలని, పోడుభూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వజ్జ పద్మ, కొమరం రత్నకుమారి, కళ్లెం పాపమ్మ, ఉపసర్పంచ్ నరేష్, శ్రీలక్ష్మి, రేణుక, కల్యాణి ప్రసిద, యశోద పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్ల నిర్మాణ స్థలం మార్చాలి



జీఎంతో మాట్లాడుతున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధి ధన్‌బాద్‌లో నిర్మించనున్న కొత్తక్వార్టర్లను మరో ప్రాంతానికి తరలించాలని కోరుతూ.. ఏరియా జనరల్ మేనేజర్ జక్కం రమేష్‌ను ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్ బుధవారం వినతిపత్రం అందజేశారు. రజాక్ మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో 60, 70 సంవత్సరాల నుంచి చాలామంది కార్మికులు కంపెనీ క్వార్టర్లతో పాటు ప్రైవేట్‌గా ఇళ్లు కట్టుకొని ఉంటున్నట్లు చెప్పారు. అయితే కంపెనీ క్వార్టర్ల స్థలంలో కంపెనీ కొత్తగా డబుల్ బెడ్ రూంలు నిర్మించడం హర్షణీయమన్నారు. కానీ ప్రైవేట్ ఇళ్ల పరిస్థితి ఎంటని, వారు చాలాకాలం నుంచి ఇదే ప్రాంతంలో ఉంటూ కార్మికుల కుటుంబాలతో మమేకమై జీవనం సాగిస్తున్నట్లు చెప్పారు. ఈ క్రమంలో మళ్లీ వారు వేరే స్థలంలో ఇళ్లు కట్టుకొని జీవించే ఆర్థిక పరిస్థితి లేదని ఈ విషయంలో యాజమాన్యం పెద్దమనసు చేసుకొని క్వార్టర్ల నిర్మాణం వేరే స్థలంలో చేసుకోవాలని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన జీఎం ఈ విషయం సంస్థ ఉన్నతాధికారులతో చర్చించి తగు చర్యలు చేపడుతామని హామీ ఇచ్చారు. ఇందుకుగాను పంచాయతీ పెద్దలు, రజాక్ జీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మందా నాగరాజు, శ్రీరాములు, కీర్తి ఓదయ్య, బాచి, వినోద్, అశోక్, పోతరాజు ప్రసాద్, రంజిత్‌లు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభం



శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్న ఏరియా జీఎం షాలేమురాజు

ఇల్లెందు: సింగరేణి సేవా సమితి ఇల్లెందు ఏరియా వారి ఆధ్వర్యంలో పోలీస్ విభాగం ఉద్యోగాల నియామకం కోసం తుది రాత పరీక్షకు ఉచిత శిక్షణ తరగతులను ఏరియా జీఎం షాలేమురాజు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 120 మంది దేహదారుఢ్య శిక్షణకు దరఖాస్తు చేసుకోగా 100 మంది హాజరై 86 మంది తుది రాత పరీక్షకు ఎంపిక కావడం అభినందనీయం అన్నారు.

కష్టపడి చదివి రాత పరీక్షలో విజయం సాధించాలని ఆకాంక్షించారు. శిక్షకుడిగా సేవలు అందించిన జైనులావుద్దీన్‌ను జీఎం సత్కరించారు. కార్యక్రమంలో అధికారుల సంఘం అధ్యక్షుడు పి.శ్రీనివాసు, డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు, రామయంద్ర, శ్రీహరి, అంజిరెడ్డి, గుర్తింపు సంఘం ఉపాధ్యక్షుడు ఎస్.రంగనాథ్, హెచ్‌ఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైకుంఠధామానికి రోడ్డు నిర్మాణం

జూలూరుపాడు: మండలంలోని పడమటనర్సాపురం వైకుంఠధామానికి వెళ్లే మార్గానికి బుధవారం టిప్పర్లతో గ్రావెల్ తోలి ఒక్కరోజులోనే రోడ్డు నిర్మించారు. బీజేపీ నాయకుడు అన్నవరపు సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎంఎస్‌ఆర్ కన్‌స్ట్రక్షన్ వారి సహకారంతో ఈ రోడ్డు నిర్మాణ పనులు జరిగాయి. కార్యక్రమంలో గ్రామపెద్దలు, రైతులు పాల్గొని హర్షం వ్యక్తం చేశారు.

అటెన్షన్ ప్లీజ్



నిరుపయోగంగా వ్యవసాయ శాఖ కార్యాలయం



జూలూరుపాడు ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలోని మండల వ్యవసాయశాఖ అధికారి కార్యాలయ భవనాలు నిరుపయోగంగా ఉన్నాయి. భవనాల చుట్టూ ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలు పెరిగి విషసర్పాలకు నిలయంగా మారింది. మండలంలో పడమట నర్సాపురం, కాకర్ల, జూలూరుపాడు, పాపకొల్లు గ్రామాల్లో రైతు వేదిక భవనాలు నిర్మించారు. ఏఓ, ఏఈఓలు ఈ రైతు వేదికల్లోనే విధులు నిర్వహిస్తున్నారు. దీంతో వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయ భవనాలు నిరుపయోగంగా ఉన్నాయి. అధికారులు స్పందించి భవనాల చుట్టూ ముళ్ల పొదలు తొలగించి, భవనాలను ఉపయోగించుకునేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

– జూలూరుపాడు

ప్రశ్నించాల్సిన అధికారి : ఎస్.రఘుదీపిక, ఏఓ, జూలూరుపాడు
సెల్ నంబర్ : 9490973774